ఐపీల దడ దడ!



- పలమనేరులో పెరుగుతున్న ఇన్‌సాల్వెన్సీ పిటిషన్‌ల జాఢ్యం
- కకావికలమవుతున్న అనధికార చీటీలు
- చేతులెత్తేస్తున్న ఏజెంట్లు
- ఎనిమిది మంది ఐపీలు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో ఇటీవల ఐపీ (ఇన్‌సాల్వెన్సీ పిటిషన్) దడ పట్టుకుంది. తరచూ ఏదో ఓ చోట ఐపీలు పెట్టారనే విషయం తెలిసి అప్పులిచ్చిన వాళ్లు అప్పు వసూలు చేసుకుంటున్నారు. ఇంకొందరు వడ్డీ వద్దులే సామీ అసలైనా ఇచ్చేయబ్బా అని వేడుకుంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సాగే అనధికారిక చీటీల్లో ప్రారంభంలోనే పాటపాడి ఆపై దాన్ని కట్టకుండా ఐపీ బాటపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారు. వీరు డబ్బు కట్టని కారణంగా ఆ చీటీలోని మిగిలిన సభ్యులకు కుచ్చుటోపీ తప్పడం లేదు. చీటీ ఏజెంట్‌ను అడిగితే వారు డబ్బు కట్టకుంటే నేనేమి చేసేదని చేతులెత్తేస్తున్నారు. దీంతో పట్టణాలే కాదు పల్లెల్లోనూ వీటి ప్రభావం కొందరు పేదలపై పడుతోంది. ముఖ్యంగా ఎవరైనా కష్టంలో ఉండి అప్పులడిగినా ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. చీటీలు పాడి ఐపీలు పెట్టిన కారణంగా కొన్ని గ్రామాలు గ్రామాలే ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితిలో పడ్డాయి.

తాజాగా రూ.38లక్షలకు ఐపీ..

గంగవరం మండలం కొంగోళ్లపల్లికి చెందిన ఓ మహిళ తాను అప్పులు చేసిన, చీటీలు పాడిన, హ్యాండ్‌లోన్ తీసుకున్న, ప్రామిసరీ నోట్లు రాసిచ్చిన 22మందికి సంబంధించి రూ.38లక్షలకు ఐపీ దాఖలు చేసింది. తన వద్ద రెండు జతల కట్టుబట్టల తప్ప ఏమీ లేదని పిటిషన్‌లో పేర్కొంది. నోటీసులందుకున్న 22మంది నెత్తినోరు కొట్టుకుంటూ లాయర్ల వద్దకు తిరుగుతున్నారు. పలమనేరు పట్టణంలోని గంటావూరుకు చెందిన ఓ మహిళ గతంలో ఐపీ పెట్టింది. ఆమెతో స్నేహం చేసిన కొంగోళ్లపల్లి మహిళ ఆమె బాటలో పయనించి తాను ఐపీ పెట్టడం కొసమెరుపు.

అప్పులివ్వని వడ్డీ వ్యాపారులు..

ఐపీల కారణంగా ఈ ప్రాంతంలో ఇప్పటికే వడ్డీలకిచ్చిన వారు నయానో భయానో ఇచ్చిన అప్పులను వెంటపడి వసూలు చేసుకుంటున్నారు. మరికొందరు వడ్డీ వద్దు అసలిస్తే చాలంటున్నారు. తీసుకున్న వారిలో కొందరు ఇప్పుడు తమ వద్ద డబ్బులేదని గట్టిగానే సమాధానం ఇస్తున్నారు. దీంతో కొత్తగా వడ్డీకి అప్పులిచ్చేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. చెక్, ప్రామిసరీ నోట్ లాంటివి ఇస్తామన్నా వద్దులేబ్బా డబ్బులేదనే మాట వినిపిస్తోంది. మొత్తం మీద ఐపీల దెబ్బకు అప్పులిచ్చినవాళ్లు ఇప్పటికే నీరుగారిపోతున్నారు. అనధికారిక చీటీలు, అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడరాదని ఇలాంటి కేసులు వచ్చిన సందర్భాల్లో పోలీసులు సూచిస్తున్నా వీరి మాటను జనం పట్టించుకోక ఇబ్బందుల్లో పడుతున్నారు.



ఇటీవల ఓ మహిళ దాఖలు చేసిన ఐపీ నోటీస్

ఎక్కువైన ఐపీలు...

పట్టణానికి చెందిన ముగ్గురు, నలసానపల్లికి చెందిన ఓ చీటీ నిర్వాహకుడు, మండలంలోని సి.కురపల్లి, కన్నమాకులపల్లికి చెందిన ఇద్దరితోపాటు మరో నలుగురు ఈ మధ్య కాలంలో ఐపీలు పెట్టారు. స్తోమతకు మించి అప్పులు చేయడం, చీటీలెత్తడం ఆపై వాటిని తీర్చలేక ఓ పద్ధతి ప్రకారం వారి పేరిట ఉన్న ఇల్లు, ఆస్తులను వేరొకరికి దాన విక్రయం లేదా విక్రయాలు చేసేస్తున్నారు. దీంతో లీగల్‌గా వారి వద్ద ఎలాంటి ఆస్తులు లేకుండా చేసుకుంటున్నారు. ఆపై తన వద్ద ఏమీ లేదని తాను అప్పులు తీర్చలేనంటూ ఐపీలు పెట్టడం ఇప్పుడో ఫ్యాషన్‌గా మారింది.

అనధికారిక చీటీల జోరు...

నియోజకవర్గంలో అనధికారిక చీటీలు 300 దాకా జరుగుతున్నట్టు సమాచారం. ఇందులో 6వేల మందికి పైగా సభ్యులుగా ఉంటున్నారు. వీరిలో ఎక్కువగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, వ్యాపారులు, పోలీసులు, రాజకీయనాయకులు, రియల్టర్లు, కొందరు సామాన్య రైతులున్నారు. ఎన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని చీటీలను నిర్వహించినా చీటి పాడిన వాళ్లు డబ్బులు కట్టకుంటే మొత్తం చీటీలోని సభ్యులకు దెబ్బపడుతోంది. వీటి కారణంగా పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోతున్నాయి. కొందరు పేదలు భూములను అమ్ముకోవాల్సి వస్తోంది. ఇక పిల్లల పెళ్లికోసమో లేక చదువులకో పనికొస్తుందని చీటీల్లో డబ్బులు కట్టిన వారి పరిస్థితి మరి ఘోరంగా మారుతోంది.

పలమనేరులో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు



పలమనేరు బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులతో ఫుడ్ కమిషన్ చైర్మన్

పలమనేరు: పట్టణంలోని పలు సంక్షేమ వసతి గృహాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బాలికల హాస్టల్‌కు వెళ్లి అక్కడి సమస్యలను పిల్లల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని ఆరా తీశారు. వచ్చే టెన్త్ పరీక్షల్లో వందశాతం ఫలితాలను సాధించాలని సూచించారు. ఆపై ఎస్సీ సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలని వార్డెన్ రాజేష్‌కు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని వారికి సూచించారు. కాగా ప్రభుత్వం నుంచి అందే మెస్ చార్జీల కంటే మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఎక్కువగా ఉన్నందునే మెనూలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్న విషయాన్ని ఆయన గుర్తించారు. ఆయన వెంట బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానీబాషా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కేసులు



పుంగనూరు: ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్న అధికారులు

పుంగనూరు: వాతావరణ కాలుష్యానికి, ప్రజల మనుగడకు విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ కవర్ల విక్రయదారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం కమిషనర్ మధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు పర్యావరణశాఖాధికారి కృష్ణవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో విక్రయాలకు దాచిన కవర్లు, ప్లాస్టిక్ కప్పులు, ఇతర వస్తువులను మున్సిపాలిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో 20 దుకాణాల్లో దాడులు జరిపారు. రూ.15 వేల జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, క్రయవిక్రయాలను మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో నిషేధించామన్నారు. కానీ కొంత మంది వ్యాపారులు తమ స్వలాభాల కోసం కర్ణాటక, తమిళనాడు నుంచి ప్లాస్టిక్ వస్తువులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారని, దీనిపై సమాచారం రావడంతో దాడులు చేయించామని ఆయన అన్నారు. రెండవ సారి దాడుల్లో పట్టుబడితే షాపులు సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



పలమనేరు: దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాలపై స్థానిక మున్సిపల్ అధికారులు మంగళవారం ప్లాస్టిక్ కవర్ల వినియోగం, హోటళ్లలో పరిశుభ్రతపై దాడులు నిర్వహించారు. ఆమేరకు ప్లాస్టిక్ కవర్ల విక్రేతలు, అపరిశుభ్రంగా ఉన్న హోటల్ నిర్వాహకులకు రూ.3వేల దాకా జరిమానా విధించినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. దాడుల్లో మున్సిపల్ శానిటరీ శాఖ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

శరవేగంగా కూర్మ వరదరాజ పనులు

- రూ.కోటితో ఆలయ పునర్నిర్మాణ పనులు
- రూ.25లక్షలు దాతలు వితరణ





కూర్మ వరదరాజస్వామి ఆలయం, (ఫైల్) ఇన్‌సెట్‌లో స్వామివారు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలోని పురాతన ఆలయాల్లో ముఖ్యమైన కూర్మాయి శ్రీకూర్మవరద రాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఆలయాన్ని దేవదాయశాఖ రూ.కోటి నగదుతో పునర్నిర్మాణ పనులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రూ.25లక్షలు దాతలు విరాళంగా అందజేశారు. ప్రస్తుతం ధ్వజ స్తంభం, ఆలయ గోపుర పనులు సాగుతున్నాయి.

పురాతన ఆలయం..

ఈ ఆలయం పేరుతోనే నేటి కూర్మాయి అనే గ్రామం వెలసి ఉండడం విశేషం. చరిత్రను పరిశీలిస్తే శ్రీకృష్ణ దేవరాయల కాలంలో శ్రీలక్ష్మీ సమేత వరదరాజస్వామి ఆలయాన్ని, ఎదురుగా విఘ్నేశ్వరుని ఆలయం సహా ఢంకణాచార్యులు అనే శిల్పి నిర్మించినట్లు తెలుస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని కురుడుమలై, యాదమరిలోని వరదరాజస్వామి గుడి, తిరుపతిలోని వరదరాజస్వామి గుడితోపాటు కూర్మాయిలోని ఈ ఆలయాన్ని కూడా ఒకేసారి నిర్మించినట్లు చరిత్రలో చెప్పబడింది. అత్యంత శిల్పకళా సౌందర్య ప్రావీణ్యంతో అబ్బురపరిచే శిల్పాలు ఈ ఆలయానికే సొంతం. ఇప్పటికే ఆలయం ఎదుట ఉన్న ధ్వజస్తంభం కూలిపోయి కింద ఉన్న అంతస్తు మాత్రమే దర్శనమిస్తోంది. ఇక ప్రధాన ఆలయంలో అడుగడుగునా అబ్బురపరిచే శిలా ఖండాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఆలయ మహద్వారం నుంచి గర్భగుడికి వెళ్లాక గర్భగుడి కింద ఓ రహస్య నేలమాళిగను అందులోనే నిర్మించారు. అయితే గర్భగుడి కింద ఉన్న నేలమాళిగలో వేటిని ప్రతిష్టించారో, ఏముందో కూడా ఇప్పటికీ ఎవరికీ తెలియదు. కౌండిన్య నదికి ఆనుకొని నిర్మించిన ఈ ఆలయంలో విశేషంగా వివాహ, శుభ కార్యక్రమాలు గతంలో జరుగుతుండేవి. ఇక్కడ పెళ్లి చేసుకున్న నూతన వధూవరులు మగ బిడ్డలనే కంటారనే ప్రతీతి ఇప్పటికీ ఉంది. అందుకే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఎందరో వధూవరులు ఎక్కడ పెళ్లి చేసుకోవాలనుకొన్నప్పటికీ ఈ ఆలయంలో ముందుగానే తాళి కడతారని ఈసందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

ఆలయ నిర్మాణంలో బయటపడిన దేవతామూర్తులు...

ఇలాఉండగా ఆలయ పునర్నిర్మాణ భాగంలో గర్భగుడి కింద వేంకటేశ్వరుడు, భూదేవి, లక్ష్మీ విగ్రహాలు బయటపడ్డాయి. వీటిని దేవదాయశాఖ గ్రామంలో బందోబస్తు మధ్య పెట్టారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక ఈ విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠ చేయనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

18 నుంచి ఆరిమాను గంగమ్మ జాతర

–మొదలైన గంగచాటు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ కల్లాడు సర్కిల్‌లో వెలసిన ఆరిమాను గంగమ్మ జాతర ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆమేరకు మంగళవారం ఆలయం వద్ద గంగచాటు జరిగింది. ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈనెల 18న అమ్మవారి శిరస్సు, 19న జాతర, 20న జలధి కార్యక్రమాలుంటాయని తెలిపారు.



అమ్మవారు చాటింపు, (ఇన్‌సెట్)లో ఆరిమానుగంగమ్మ

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి

పుంగనూరు: మామిడి పండ్లకు సంబంధించి మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన పొగాకు బోర్డును ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రజలకు ఇష్టమైన మామిడి పండ్ల క్రయవిక్రయాలను ప్రోత్సహించేందుకు బోర్డును ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి, మ్యాంగో బోర్డు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఉబ్బమ్మ దేవర



ప్రత్యేక పూజలందుకుంటున్న ఉబ్బమ్మ అమ్మవారు

కుప్పం: రజక కులస్తుల కులదేవత శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ దేవర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతపేట దోబీఘాట్ వద్ద వెలసిన ఉబ్బమ్మ ఆలయంలో రజక కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాతపేట, విజయలక్ష్మి రోడ్డు, పైబాటలో ఉన్న రజకులు డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పొంగళ్లు పెట్టి సమర్పించారు. అమ్మవారికి ఏటా రజకులు సంప్రదాయబద్ధంగా చేపట్టే దీపాలతో పిండి వంటలు చేసి పూజలు నిర్వహించారు. దోబీఘాట్‌లో కులవృత్తిని చేపట్టే ప్రాంతంలో పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దోబీఘాట్ ప్రాంతంలో ఊరేగించారు.

భూ ఆక్రమణలపై విచారణ

సదుం: భూ ఆక్రమణలపై విచారణ జరపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ స్థానిక తహసీల్దార్ హుస్సేన్‌కు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బాధితుడి వివరాల మేరకు..మండల కేంద్రంలోని కల్లూరు రోడ్డుకు చెందిన హేమాద్రి తన ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంతో పాటు సీతమ్మ చెరువు నుంచి పెద్ద కాలువకు నీటిని సరఫరా చేసే సప్లై చానల్, వీరభద్రస్వామి ఆలయానికి చెందిన 0.37 ఎకరాల భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని గత నెలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదికను పంపాల్సిందిగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు అందినట్టు బాధితుడు మంగళవారం తెలిపారు.

మూతపడుతున్న అంగన్‌వాడీలు!



మూతపడిన బోడిపాటి వారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం



నలుగురు పిల్లలతో నడుస్తున్న మేకలవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం

- కేంద్రాల్లో తగ్గుతున్న పిల్లల సంఖ్య
- కేంద్రాల్లో 1,2,3,4 మంది పిల్లలే
- మూత దశకు మరో నాలుగు కేంద్రాలు

రొంపిచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా శిశు మరణాలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. అయితే రొంపిచెర్ల మండలంలో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాకపోవడంతో అవి మూతపడే దశకు చేరుకుంటున్నాయి. మండలంలో 27 ప్రధాన, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో 19 కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. 13 కేంద్రాలు అద్దె లేకుండా నడుస్తున్నాయి. 5 కేంద్రాలు మాత్రం అద్దె భవనాలలో నడుస్తున్నాయి. 37 మంది అంగన్‌వాడీ టీచర్లు, 26 మంది ఆయాలు పనిచేస్తున్నారు. మండలంలో 1,299 మంది 0–5 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లల ఉన్నారు. అలాగే 177 మంది గర్భవతులు, 138 మంది బాలింతలు ఉన్నారు. వీరికి ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. గత నాలుగు సంవత్సరాల నుంచి చూస్తుంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. రొంపిచెర్ల –1 అంగన్‌వాడీ కేంద్రంలో మూడు సంవత్సరాల క్రితం 35–40 మంది పిల్లలు ఉండేవారు. రొంపిచెర్ల క్రాస్ రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో 30 మంది పిల్లలు ఉండేవారు. అయితే నేడు రెండు కేంద్రాల్లోను 15–25 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. బోడిపాటివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు లేక ఆరు నెలల క్రితం మూతపడింది. మేకలవారిపల్లె, శ్రీనాథపురం కాలనీ, కొండారెడ్డిగారిపల్లె, బండకింద హరిజనవాడ, గెర్లపల్లె కేంద్రాల్లో ఐదుగురు లోపు ఉన్నారు.

వారంలో ఒకటి రెండు రోజులు పిల్లలు పూర్తిగా హాజరుకాని సంఘటనలు ఉన్నాయి. పిల్లలు లేని కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లను ఎక్కువ మంది పిల్లలు ఉన్న కేంద్రాలకు బదిలీ చేస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఐసీడీఎస్ అధికారులు అటు వైపు దృష్టి పెట్టడం లేదు. దీంతో ప్రభుత్వ ఆశయం దెబ్బతింటోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

టీచర్లను బదిలీ చేస్తాం



పిల్లలు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లను పిల్లలు ఎక్కువ మంది ఉన్న కేంద్రాలకు బదిలీ చేస్తాం. కేంద్రాల్లో రోజురోజుకు పిల్లల సంఖ్య తగ్గుతుండడం నిజమే. తల్లులు ఒకటి లేదా ఇద్దరు బిడ్డలకే ఆపరేషన్లు చేసుకోవడం వలన పిల్లలు తగ్గిపోతున్నారు.

– సూపర్‌వైజర్ శిరీష

క్లుప్తంగా

8 నుంచి బ్రహ్మోత్సవాలు



పులిచెర్ల(కల్లూరు): ఈనెల 8 నుంచి మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. పది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో 14వ తేదీన స్వామి వారి కల్యాణం, 15న రథోత్సవం, 16న పారువేట, 17న చక్రస్నానం, 18న ఊంజల్ సేవ మిగిలిన రోజుల్లో వివిధ రకాల వాహన సేవలు నిర్వహిస్తారని తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న సిబ్బంది

సదుం: పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఈనెల 30 వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 2వేల పశువులకు టీకాలు వేశామన్నారు. టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు జిల్లా టీబీ అధికారి డా.వెంకటప్రసాద్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ ఎలా వ్యాపిస్తుంది, ఇది ఇతరులకు ఎలా సోకుతుంది, దీని లక్షణాలు ఎలా ఉంటాయి, నివారణ మార్గాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ సుధారాణి, సీహెచ్‌ఓ విజయభారతి, ఎంపీహెచ్‌ఎస్ మధు పాల్గొన్నారు.

9న రిక్రియేషన్ క్లబ్ సమావేశం

పలమనేరు: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న స్థానిక క్లబ్‌లో నిర్వహించనున్నట్టు క్లబ్ పాలకవర్గం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకు సభ్యులు విధిగా హాజరుకావాలని అందులో సూచించారు. భవిష్యత్తులో క్లబ్ అభివృద్ధిపై ఈ సందర్భంగా చర్చించనున్నట్లు అందులో పేర్కొంది.

నేడు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో పారిశుధ్య కార్యక్రమాలపై బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి ప్రారంభమవుతుండడంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మురుగునీటి నిల్వలను తొలగించి, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సహదేవి

పెద్దపంజాణి: స్థానిక మండల కేంద్రంలో ఎస్‌ఐ సహదేవి మంగళవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నూతన వాహనాల చట్టం గురించి వివరించారు. నూతన వాహన చట్టం ద్వారా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేకపోవడం, శబ్ద కాలుష్యం చేయడం, మైనర్లు, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే విధించే జరిమానాల గురించి తెలిపారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

వెలుగు సంఘం సభ్యులకు అవగాహన సదస్సు

వి.కోట: మండల వెలుగు సంఘం సభ్యులకు బుధవారం ఈస్ట్‌మెన్ గార్మెంట్స్ సంస్థ ద్వారా వెలుగు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పించడంపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీఎం లావణ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక పీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగే సదస్సుకు మండల పరిధిలోని స్వయం సహాయక సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

9న మండల మీట్

కుప్పం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 9న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌పథ్ తెలిపారు. ఆదివారం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షుడు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.